క్లుప్తంగా

శేషవాహనంపై విహరించిన మహావిష్ణు



నెల్లూరు(బృందావనం): వేదాయపాళెంలోని అయ్యప్ప దేవస్థాన ప్రాంగణంలో గల మహాలక్ష్మి గోదా సమేత గురువాయూర్ మహావిష్ణు దేవస్థాన బ్రహ్మోత్సవాల్లో మహావిష్ణు ఉభయదేవేరులతో శేషవాహనంపై ఆదివారం విహరించారు. భద్రాచలంలోని సీతారామచంద్రస్వామి దేవస్థాన స్థానాచార్యుడు కొమాండూరు ఇళయవిల్లి స్థలశాయి ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలను చేపట్టారు. ఉభయకర్తలుగా తలమంచి వెంకటేశ్వరరావు, వెంకట సునీత, రత్నయ్య, సుజాత, పీటీ జగన్నాథం, పద్మజ, విష్ణుతేజ, శ్రీనివాస్, భార్గవి వ్యవహరించారు. అయ్యప్ప సేవా సమాజ అధ్యక్ష, కార్యదర్శులు శేషగిరిరావు, వెంకటరత్నం, మురళీమోహన్‌రెడ్డి, బిరదవోలు శ్రీకాంత్‌రెడ్డి, తదితరులు పర్యవేక్షించారు.

టీడీపీ నేతల దాష్టీకం



గాయపడిన వెంకట్

నెల్లూరు(వీఆర్సీసెంటర్): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మద్దతుదారులపై టీడీపీ నేతలు దాడికి పాల్పడిన ఘటన 53వ డివిజన్లోని గాంధీ గిరిజన కాలనీలో ఆదివారం చోటు చేసుకుంది. వివరాలు.. స్థానికంగా ఉండే దేవరకొండ వెంకట్, అతని సోదరుడు సిసింద్రీపై టీడీపీ నేతలు అకారణంగా దాడి చేసి గాయపర్చారు. దాడిలో తీవ్రంగా గాయపడిన వెంకట్ ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

షూటింగ్ బాల్ క్రీడాకారులకు సన్మానం

బుచ్చిరెడ్డిపాళెం: స్థానిక రెయిన్‌బో ప్రైవేటు పాఠశాలలో అంతర్జాతీయ షూటింగ్ బాల్ క్రీడాకారులను ఆదివారం సన్మానించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ షూటింగ్ బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు భీమతాటి రమణయ్య మాట్లాడుతూ గత ఫిబ్రవరి నెలలో ఉత్తరప్రదేశ్‌లో జరిగిన మొదటి ఏషియన్ షూటింగ్ బాల్ పోటీల్లో కృష్ణాజిల్లాకు చెందిన విజయ్‌కుమార్, హనీత్‌నాగ్, శివాంజనేయులు భారత జట్టు తరఫున పాల్గొన్నారని తెలిపారు. అలాగే అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పరుశురాముడు మాట్లాడుతూ సెప్టెంబర్‌లో బుచ్చిరెడ్డిపాళెంలో జాతీయ స్థాయి షూటింగ్ బాల్ పోటీలను నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మోర్ల భరత్, సీనియర్ క్రీడాకారులు దేవేంద్ర, పరమేశ్వరరెడ్డి, భరత్‌కుమార్, నవ్య, సుస్మితలు పాల్గొన్నారు.

వేడుకగా విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు

ముత్తుకూరు: కృష్ణపట్నంలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి(విష్ణాలయం) ఆలయంలో విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. అందులో భాగంగా ఆదివారం వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ 22 విగ్రహాలకు అభిషేకాలు చేసి గ్రామోత్సవం నిర్వహించారు. కాగా సోమవారం నూతన విగ్రహాల ప్రతిష్ట, శిఖర కలశ ప్రతిష్ట నిర్వహించనున్నారు. హంపీ విరూపాక్ష విద్యారణ్యభారతిస్వామి హాజరై భక్తులకు అనుగ్రహ భాషణం చేశారు. ఆలయ ఈఓ జనార్దన్‌రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ సుబ్బయ్య పిళ్లైలు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

గ్రంథాలయ పితామహుడు అయ్యంకి

కొడవలూరు: గ్రంథాలయాల ఏర్పాటుకు బీజం వేసి గ్రంథాలయాల పితామహుడిగా అయ్యంకి వెంకటరమణయ్య పేరు గడించారని విశ్రాంత ఉపాధ్యాయుడు వెంకయ్య కొనియాడారు. కొడవలూరు గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరం ముగింపు సందర్భంగా అయ్యంకి చిత్రపటానికి ఆదివారం ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రంథాలయాల ఆవశ్యకతను గుర్తించిన అయ్యంకి వాటి ఏర్పాటుకు ఎంతగానో కృషి చేశారన్నారు. నేటి సమాజంలో గ్రంథాలయాలు విజ్ఞాన కేంద్రాలుగా వర్ధిల్లుతున్నాయంటే అందులో అయ్యంకి కృషి ఎంతో ఉందని పేర్కొన్నారు. అనంతరం వివిధ పోటీల్లో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. చివరిగా విశ్రాంత ఉపాధ్యాయుడు వెంకయ్యను ఘనంగా సన్మానించారు. లైబ్రేరియన్ కే రాజేశ్వరి, పాఠకులు పాల్గొన్నారు.

ఇందుకూరుపేట: మండలంలోని మైపాడు, ఇందుకూరుపేట శాఖ గ్రంథాలయాల్లో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరాలు ఆదివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా విద్యార్థులకు ఆటలు, పాటలు, వ్యాసరచన, తదితర అంశాలపై పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. మైపాడులో జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ సంగం వెంకయ్య, లైబ్రేరియన్ మంజులత పాల్గొన్నారు. ఇందుకూరుపేటలో జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ పద్మావతమ్మ, లైబ్రేరియన్ నాగరాజు, పంచాయతీ కార్యదర్శి మల్లికార్జున, తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యమస్తు..

- నగర వాసులకు చెంతనే ఉచిత వైద్యం
- ప్రజల ఆరోగ్య సంరక్షణకు భరోసా
- గతంలో 8.. నేడు 13 పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ఏర్పాటు

నెల్లూరు(బారకాసు): నగరంలో ఏర్పాటు చేసిన డాక్టర్ వైఎస్సార్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ప్రజల ఆరోగ్య సంరక్షణకు అభయమిస్తున్నాయి. ఈ ఆరోగ్య కేంద్రాల్లో కార్పొరేట్ స్థాయిలో ఉచిత వైద్యసేవలందుతున్నాయి. సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేసిన నాటి నుంచి వైద్య రంగం కొత్త పుంతలు తొక్కుతోంది. నగరంలో గతంలో పట్టణ ఆరోగ్య కేంద్రాల సంఖ్య ఎనిమిది కాగా, ప్రస్తుతం ఈ సంఖ్య 21కు చేరింది. ఇందులో చాలా వరకు ఆరోగ్య కేంద్రాలు కొత్త భవనాల్లో కొనసాగుతున్నాయి. ఒక్కో ఆస్పత్రికి రూ.1.1 కోట్ల చొప్పున వెచ్చించి కార్పొరేట్‌కు దీటుగా ఎంతో అధునాతనంగా తీర్చిదిద్దారు. ఎనిమిది పాత ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల భవనాల మరమ్మతులకు రూ.10 లక్షల చొప్పున వెచ్చించారు.

ఆదరణ అమోఘం

డాక్టర్ వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో షుగర్, బీపీ, జ్వరాలు, వాంతులు, విరేచనాలు, తదితర వ్యాధులకు వైద్యసేవలను ఉచితంగా అందిస్తున్నారు. ఇక్కడ 64 రకాల వైద్యసేవలతో పాటు 172 రకాల మందులు లభిస్తున్నాయి. ఒక్కో ఆస్పత్రికి రోజుకు 30 నుంచి 70 మందికి పైగా అవుట్ పేషెంట్స్ వస్తున్నారంటే ఆదరణను అర్థం చేసుకోవచ్చు.

ఉదాహరణకు నగరంలోని మైపాడు రోడ్డు, పాత చెక్‌పోస్ట్ వద్ద గల వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రానికి రోజూ 60కిపైగా ఓపీలు వస్తున్నాయి. ఈ ఆస్పత్రులు ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు పనిచేస్తున్నాయి. ఆస్పత్రుల్లో లభిస్తున్న వైద్యసేవలపై నగర వాసులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



మహబూబ్‌ఖాన్ పార్కు ప్రాంగణంలోని వైఎస్సార్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవనం

ప్రస్తుతం కార్పొరేట్‌కు దీటుగా..

నగరంలో ప్రస్తుతం కొత్తగా 13 పట్టణ ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేశారు. మొత్తం 21 ఆరోగ్య కేంద్రాలున్నాయి. నగరపాలక సంస్థ పరిధిలోని 54 డివిజన్లకు గానూ రెండు, మూడు డివిజన్లకో డాక్టర్ వైఎస్సార్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అందుబాటులో ఉంది. ఆయా కేంద్రాల్లో మందులు పుష్కలంగా లభిస్తున్నాయి. నూతన భవనాలు.. కొత్త పరికరాలతో కార్పొరేట్ హాస్పిటళ్లను తలపిస్తున్నాయి. ఫలితంగా నగర వాసులకు మెరుగైన వైద్యం చెంతనే లభిస్తోంది.

గతంలో అన్నీ అవస్థలే..

నగరంలో గతంలో ఎనిమిది పట్టణ ఆరోగ్య కేంద్రాలు ఉండేవి. పైగా నిత్యం మందుల కొరత వేధించేది. వైద్య పరీక్షలూ అంతంతమాత్రంగా జరిగేవి. పైగా ఆయా ఆస్పత్రుల భవనాలు శిథిలావస్థకు చేరుకోవడంతో ప్రజలు వాటిపై పెద్ద ఆసక్తి చూపేవారు కాదు. సౌకర్యాలూ అరకొరగానే ఉండేవి. ఈ విధంగా గత ప్రభుత్వ హయాంలో పట్టణ వైద్యం గాడి తప్పింది.

నగరంలోని ఆరోగ్య కేంద్రాలు..



- జనార్దన్‌రెడ్డికాలనీ, జాకీర్‌హుస్సేన్‌నగర్ (న్యూ కాలనీ), కోటమిట్ట, ఎన్టీఆర్‌నగర్, వెంగళరావునగర్, పడారుపల్లి, క్రాంతినగర్, యాకోనగర్. ఈ ప్రాంతాల్లో గతంలో ఉన్నవి.
- పాత చెక్‌పోస్ట్ (ఆర్ అండ్ బీ యార్డు), నవాబుపేట (తోటబడి ప్రాంగణం), మహిళా ప్రాంగణం, కపాడిపాళెం, రామచంద్రాపురం, జేవీఆర్ కాలనీ, చాకలివీధి, రాజాగారివీధి, చంద్రమౌళీనగర్, ఈఎస్సార్ఎం స్కూల్ (మూలాపేట), పోలేరమ్మ చెట్టు, యలమవారి దిన్నె, వేదాయపాళెం. ఈ ప్రాంతాల్లో నూతనంగా ఏర్పాటు చేసిన కేంద్రాలు.

పేదలకు అందుబాటులో ఆరోగ్య కేంద్రాలు



వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రభుత్వం ఏర్పడ్డాక మాలాంటి వారికి అందుబాటులో ఆరోగ్య కేంద్రాలను నెలకొల్పి ఎంతో మేలు చేశారు. ప్రైవేట్ ఆస్పత్రులకెళ్లే స్తోమత లేదు. వైఎస్సార్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలతో ఎంతో ఉపయోగంగా ఉంది. – యానాదయ్య, జాకీర్‌హుస్సేన్‌నగర్

కార్పొరేట్‌కు దీటుగా..



నగరంలో గతంలో ఆరోగ్య కేంద్రాలు సక్రమంగా పనిచేసేవి కావు. అత్యవసర సందర్భాల్లో ప్రాథమిక వైద్యం కోసం పట్టణ ఆరోగ్య కేంద్రాలకెళ్తే వైద్యులు ఉండేవారు కాదు. పైగా అవసరమైన మందులు అందుబాటులో ఉండేవి కాదు. ఇప్పుడు వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రాల ఏర్పాటుతో వైద్యులు అందుబాటులో ఉంటూ, అవసరమైన అన్ని రకాల మందులను ఇస్తున్నారు.
– మారెళ్ల నాగజ్యోతికుమారి, బాలాజీనగర్

ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు చర్యలు



తోపుడు బండ్ల వారితో మాట్లాడుతున్న అబ్దుల్ సుభాన్

నెల్లూరు(క్రైమ్): ఏసీ కూరగాయల మార్కెట్, మద్రాస్ బస్టాండ్, తదితర ప్రాంతాల్లో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు ట్రాఫిక్ డీఎస్పీ అబ్దుల్ సుభాన్, సిబ్బందితో కలిసి ఆదివారం చర్యలు చేపట్టారు. మార్కెట్ సమీపంలో తోపుడు బండ్లు, కొందరు చిరువ్యాపారులు రోడ్లపైనే వ్యాపారాలు సాగిస్తుండటంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడటంపై ఆయన మండిపడ్డారు. రహదారులపై ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించేలా వ్యాపారులు వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. దుకాణల వద్ద క్రమపద్ధతిలో వాహనాలను నిలిపేలా దుకాణదారులు చర్యలు చేపట్టాలని సూచించారు. ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి ఆదేశాల మేరకు నగరంలో ట్రాఫిక్‌ను పూర్తిస్థాయిలో క్రమబద్ధీకరించి.. మెరుగైన ట్రాఫిక్‌ను అందించేలా చర్యలు చేపట్టామని వివరించారు. ఇందులో భాగంగా వన్‌వేలు, పలుచోట్ల మార్పులు, చేర్పులు చేపట్టామన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా మైనర్, ట్రిపుల్ రైడింగ్, డ్రంక్ అండ్ డ్రైవ్‌పై స్పెషల్ డ్రైవ్‌ను నిర్వహిస్తున్నామని తెలిపారు.

మర్యాదపూర్వకంగా..



నెల్లూరు(సెంట్రల్): రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి డాక్టరేట్‌ను అందుకున్న నేపథ్యంలో నగరంలోని ఆయన క్యాంప్ కార్యాలయంలో ఏపీ అగ్రికల్చర్ ఆఫీసర్స్ అసోసియేషన్ నేతలు మర్యాదపూర్వకంగా ఆదివారం కలిశారు. అధ్యక్షుడు హరికరుణాకర్‌రెడ్డి, సెక్రటరీ నాగమోహన్, ఏడీఏలు శ్రీనివాసులు, కన్నయ్య, ఏఓలు వాసు, రామ్మోహన్, తదితరులు పాల్గొన్నారు.

కొబ్బరి నీళ్లు, మజ్జిగ పంపిణీ



నెల్లూరు(అర్బన్): నగరంలోని వివిధ ప్రాంతాల్లో ట్రాఫిక్ పోలీసులకు టెంకాయ నీళ్లు, మజ్జిగ బాటిళ్లను యంగ్ ఇండియన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం పంపిణీ చేశారు. సంఘ సభ్యులు బావిశెట్టి కిశోర్, పవన్, శివ, రమేష్, కోటి, గునుకుల కిశోర్, తదితరులు పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన కాంట్రాక్ట్ ఉద్యోగులు



నెల్లూరు(దర్గామిట్ట): రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని నగరంలోని ఆయన నివాసంలో పలువురు కాంట్రాక్ట్ ఉద్యోగులు ఆదివారం కలిశారు. తమను క్రమబద్ధీకరిస్తూ నిర్ణయం తీసుకున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలను తెలియజేశారు. సీఎం నిర్ణయంతో వేలాది మంది కాంట్రాక్ట్ ఉద్యోగులకు న్యాయం జరిగిందని సంతోషం వ్యక్తం చేశారు.

ఉత్సాహంగా క్రికెట్ టోర్నీ



నెల్లూరు (టౌన్): పొదలకూరు రోడ్డులోని సంజయ్‌గాంధీనగర్‌లో క్రికెట్ టోర్నీని ఆదివారం నిర్వహించారు. అరుణ్ ప్రథమ వర్ధంతిని పురస్కరించుకొని నిర్వహించిన టోర్నీకి ముఖ్యఅతిథిగా హాజరైన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేత బెజవాడ మేఘనాథ్‌సింగ్ మాట్లాడారు. 31, 32, 33వ డివిజన్ల నుంచి 8 జట్లు టోర్నీలో పాల్గొన్నాయని చెప్పారు. అనంతరం విజేతగా నిలిచిన ఎస్జీఎన్ స్టార్స్ జట్టుకు రూ.ఐదు వేలను శమంతకమణి ట్రస్ట్ ఆధ్వర్యంలో అందజేశారు. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్, మ్యాన్ ఆఫ్ ది సిరీస్‌కు ఎంపికైన వారికి బహుమతులను ప్రదానం చేశారు.

ముగిసిన బాలవికాస్ వేసవి శిబిరం



సత్యసాయి చిత్రపట ఊరేగింపు



సర్టిఫికెట్లను అందుకున్న చిన్నారులు

నెల్లూరు(బారకాసు): గోమతినగర్‌లోని సాయిహృదయ, సత్యసాయి మందిరంలో నెల రోజులుగా నిర్వహిస్తున్న ప్రత్యేక వేసవి శిబిరం ఆదివారంతో ముగిసింది. ఈ సందర్భంగా పురవీధుల్లో సత్యసాయిని ఊరేగించారు. అనంతరం చిన్నారులకు బహుమతులను అందజేశారు. చిన్నారులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. సాయిహృదయ మందిర నిర్వాహకులు మురళీకృష్ణ, కొండా శేషగిరిరావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో బాలవికాస్ గురువులు ప్రభావతమ్మ, భారతి, నాగలక్ష్మి, భ్రమరాంబ, తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు సర్టిఫికెట్ల ప్రదానం



నెల్లూరు(మినీబైపాస్): జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో 34 రోజుల పాటు నిర్వహించిన చదవడం మాకిష్టం, వేసవి విజ్ఞాన తరగతులు ఆదివారంతో ముగిశాయి. నగరంలోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులను అందజేశారు. గ్రంథాలయ సంస్థ జిల్లా కార్యదర్శి కుమార్‌రాజా, డిప్యూటీ లైబ్రేరియన్ ప్రసాద్, ఉపాధ్యాయుడు సతీష్‌కుమార్, యోగా మాస్టర్ రాజేంద్రప్రసాద్, సుబ్బారావు, జితేంద్ర, రవీంద్రన్, గిరిజ, పూర్ణచంద్రారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

- రంగనాయకులపేటలోని గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిర ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజాసైన్స్ వేదిక పట్టణాధ్యక్షుడు సతీష్‌కుమార్‌ను లైబ్రేరియన్ అరుణ సత్కరించారు. అనంతరం పిల్లలకు బహుమతులు, సర్టిఫికెట్లను అందజేశారు.

మారిన మెనూతో పౌష్టికాహారం





కొండాయపాళెం గేట్ సెంటర్‌లోని హాస్టల్‌ను తీర్చిదిద్దుతున్న సిబ్బంది

- నేటి నుంచి హాస్టళ్ల పునఃప్రారంభం
- వసతిగృహాలను సిద్ధం చేస్తున్న అధికారులు

నెల్లూరు(వేదాయపాళెం): రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం మేరకు స్కూళ్లతో పాటు సంక్షేమ హాస్టళ్లు సోమవారం పునఃప్రారంభం కానున్నాయి. వేసవి సెలవుల నేపథ్యంలో మూతపడిన హాస్టళ్లను ప్రారంభించేందుకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమ శాఖల అధికారులు చర్యలు చేపట్టారు. ఇప్పటికే ఆయా వసతిగృహ సంక్షేమాధికారులు హాస్టల్ పరిసరాలను శుభ్రం చేయడం, గదులకు మరమ్మతులు, కరెంట్, నీరు, మరుగుదొడ్లను సిద్ధం చేస్తున్నారు.

జిల్లాలో హాస్టళ్లు	విద్యార్థుల సంఖ్య
ఎస్సీ – 71	3600
బీసీ – 73	3200
ఎస్టీ – 17	1100

విద్యార్థులను హాస్టళ్లలో చేర్పించేందుకు గానూ వార్డెన్లు, సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం కల్పిస్తున్న వసతులు, సౌకర్యాలు, విద్యపై అవగాహన కల్పిస్తున్నారు. జిల్లాలో ఎస్సీ 71, బీసీ 73, ఎస్టీ 17 హాస్టళ్లున్నాయి. నాడు – నేడు పథకంలో భాగంగా సంక్షేమ వసతి గృహాలను రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి చేసి, సౌకర్యాలను మెరుగుపర్చడంతో చేరేందుకు విద్యార్థులు సుముఖత చూపుతున్నారు.

మెరుగైన సౌకర్యాలు



సంక్షేమ హాస్టళ్ల విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నాం. కలెక్టర్ ఆదేశాల మేరకు హాస్టళ్లలో అన్ని వసతులను సిద్ధం చేస్తున్నాం. విద్యుత్, టాయ్‌లెట్లను అందుబాటులోకి తీసుకొచ్చి రూములు, పరిసరాలను శుభ్రం చేశాం. నూతన మెనూ మేరకు విద్యార్థులకు పౌష్టికాహారాన్ని అందించేందుకు కృషి చేస్తాం.
– వెంకటయ్య, జిల్లా బీసీ సంక్షేమ, సాధికారత అధికారి

కల్పిస్తున్న సౌకర్యాలు..

- మూడో తరగతి నుంచి పదో తరగతి వరకు ప్రవేశాన్ని కల్పిస్తున్నారు.
- హాస్టల్లో చేరిన విద్యార్థికి ఏటా ఒక ట్రంక్ పెట్టె, రెండు దుప్పట్లు, స్టీల్ ప్లేట్, గ్లాస్‌ను అందిస్తున్నారు.
- కాస్మొటిక్ చార్జీల కింద నెలకు రూ.155ను ఇస్తున్నారు.
- మెడికల్ క్యాంప్‌ను ప్రతి నెలా ఏర్పాటు చేసి విద్యార్థులకు వైద్యసేవలను అందిస్తున్నారు.
- పదో తరగతి విద్యార్థులకు ఇంగ్లిష్, గణితం, సైన్స్, హిందీ సబ్జెక్టుల్లో ప్రత్యేక ట్యూటర్లను ఏర్పాటు చేసి ట్యూషన్‌ను చెప్పిస్తున్నారు.

నూతన మెనూ అమలు

- హాస్టల్ విద్యార్థులకు వారంలో మూడు రోజులు చికెన్‌ను అందించేలా నూతన మెనూను రాష్ట్ర ప్రభుత్వం రూపొందించింది. మెనూను జూన్ ఒకటి నుంచి అమల్లోకి తీసుకొచ్చింది. ప్రభుత్వ హాస్టళ్లలో వసతి పొందుతున్న విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలనే లక్ష్యంతో డైట్ చార్జీలను ప్రభుత్వం పెంచింది. వారంలో ఆరు రోజులు కోడి గుడ్డు, ఏడు రోజులు అరటి పండు, సాయంత్రం వేరుశనగ చిక్కీ, రోజూ ఉదయం ఏడు గంటలకు గ్లాస్ పాలు, మెనూ ప్రకారం టిఫిన్, భోజనాన్ని అందిస్తారు. డైట్ చార్జీలను విద్యార్థికి రూ.1250 నుంచి రూ.1400 చొప్పున పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు.
- నూతన మెనూ మేరకు ప్రీ మెట్రిక్ హాస్టల్ విద్యార్థులకు వారంలో మూడు రోజులు చికెన్, ఉదయం అల్పాహారం, మిడ్ మార్నింగ్ స్నాక్స్, రోజూ ఉదయం పాలు, వారంలో ఆరు సార్లు కోడిగుడ్డు, మధ్యాహ్న భోజనంలో అన్నం, సాంబార్, గుడ్డు కూర, రోజూ రాత్రి ఫుల్ భోజనం, తర్వాత అరటి పండ్లను అందజేయనున్నారు. పోస్ట్‌మెట్రిక్ విద్యార్థులకూ అదే మెనూను అమలు చేయనున్నారు. అన్ని హాస్టళ్లలో కచ్చితంగా అమలు చేసేలా ఆయా సంక్షేమ శాఖల జిల్లా అధికారులు చర్యలు చేపడుతున్నారు.

ఆధ్యాత్మిక భావన కలిగించే పుస్తకాలు చదవాలి



నెల్లూరు(బృందావనం): ఆధ్యాత్మిక భావన కలిగించే పుస్తకాలను చదవాలని హంపీ విరూపాక్ష మహాసంస్థాన జగద్గురు శంకరాచార్య విద్యారణ్య భారతి అనుగ్రహభాషణ చేశారు. ముత్తుకూరు మండలం కృష్ణపట్నంలో పునర్నిర్మాణం చేపట్టిన సిద్ధేశ్వర వేణుగోపాలస్వామి దేవస్థానంలో నూతన శిలా విగ్రహ జీవధ్వజ ప్రతిష్ట మహా కుంభాభిషేక మహోత్సవాల్లో పాల్గొనేందుకు గానూ జిల్లాకు ఆయన విచ్చేశారు. ఈ క్రమంలో గాంధీబొమ్మ సమీపంలోని వెంకట్రామా బుక్ షాపీని ఆదివారం ఆయన సందర్శించారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, తదితరులకు మంగళశాసనాలను అందించారు. దుకాణ అధినేత శ్రీపతి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

ఏజెంట్ల ఎంపికలకు ఇంటర్వ్యూలు

నెల్లూరు(మినీబైపాస్): తపాలా జీవిత బీమా, గ్రామీణ తపాలా జీవిత బీమా పాలసీలను సేకరించేందుకు గానూ ఏజెంట్ల ఎంపికకు ఇంటర్వ్యూలను నిర్వహించనున్నామని తపాలా శాఖ సూపరింటెండెంట్ రామకృష్ణ పేర్కొన్నారు. ఆచారి వీధిలోని ప్రధాన తపాలా కార్యాలయంలో గల పోస్టల్ సూపరింటెండెంట్ కార్యాలయంలో ఈ నెల 19వ తేదీ ఉదయం 11 గంటలకు ఇంటర్వ్యూలను నిర్వహించనున్నామని చెప్పారు.